# కష్టజీవుల శతదినోత్సవం

రంగురంగుల లైట్ల తోరణాలతో థియేటరంతా వెలిగిపోతోంది. 'వెల్‌కమ్' బోర్డుకువున్న లైట్లు వెలుగుతూ ఆరిపోతూ వున్నాయి. థియేటర్ ముందు ప్రదేశమంతా రకరకాల కార్లతో నిండిపోయి వుంది. ఇంకా కార్లు వస్తూనే వున్నాయి. థియేటర్ ముందు ఖాళీ లేక రోడ్డువారగా ఆగుతున్నాయి.

థియేటర్ ముందు వేలకొద్దీ మనుషులు నిల్చుని వున్నారు. ఒకరిమీద ఒకరుపడి నెట్టుకుంటున్నారు. పోలీసులు వాళ్లను అదుపులో ఉంచలేక సతమతమవుతున్నారు. జనం ఆగడం లేదు. తమ అభిమాన హీరో రాంబాబును చూడటానికి నెట్టుకుంటూ వస్తున్నారు.

ప్రముఖ తెలుగు హీరో రాంబాబు ఆరోజు సాయంత్రం ఆ థియేటర్‌కు వచ్చాడు. ప్రఖ్యాత హీరోయిన్ కుముదిని కూడా అతనితో కలిసివచ్చింది. మిగిలిన నటీనటులు ఇతర ప్రముఖులూ వాళ్ల ఎదురుగా కూర్చున్నారు.

ఆ థియేటర్లో 'కష్టజీవులు' సినిమా శతదినోత్సవం జరుగుతోంది.

ముందుగా నిర్మాత లేచి నిల్చుని మాట్లాడటం మొదలుపెట్టాడు.

''నిజానికి ఈ 'కష్టజీవులు' సినిమా తియ్యటానికి నాకు ప్రోద్బలమిచ్చిన సంఘటనలు కొన్ని వున్నాయి. ఆ సంఘటనలను చూసిన తర్వాత ఓ క్రయిమ్ సినిమా తీయాలనే ఆలోచనలోవున్న నేను ఆ ప్రయత్నాన్ని వదులుకుని ఈ 'కష్టజీవులు' తీశాను.''

''నాకు తెలిసిన ఓ కూలివాడు వున్నాడు. వాడు రోజంతా కష్టపడి పనిచేస్తాడు. కాని వాడికి వచ్చే కూలి వాడి కుటుంబం కడుపునిండా తినటానికి సరిపోదు. హఠాత్తుగా వాడు చనిపోయాడు. వాడి కుటుంబం దిక్కులేనిదైపోయింది. వాడి భార్య పిల్లలను పోషించుకోటానికి ఒళ్లమ్ముకోవటం మొదలుపెట్టింది. ఇలాంటి సంఘటనే మరొకటి జరిగింది. నా మనస్సు నిలవలేదు. వెంటనే [illegible] తీశాను.''

''ఐతే ఈ సినిమా బాగా ఆడుతుందా? [illegible] నేను ఆలోచించలేదు. కష్టజీవుల సమస్యలను చిత్రించాలని అనుకున్నాను. తీశాను. అంతే. కాని నా అదృష్టంకొద్దీ సినిమా విజయవంతమయింది. బాగా లాభాలను కూడా సంపాదించిపెట్టింది. ఈ చిత్రం విజయం సాధించటానికి మాటికి మారుపాళ్లు కష్టజీవులే కారణం. ఈ సందర్భంలో వాళ్లందరికీ నా కృతజ్ఞతలు''

ఇలా మాట్లాడిన తర్వాత కూర్చున్నాడు. థియేటరంతా చప్పట్లతో మోగిపోయింది.

ఆ థియేటర్లో ఒక్క కష్టజీవి కూడా లేదని ఆ నిర్మాత గమనించలేదు. అక్కడ కూర్చున్న వాళ్లందరూ హైక్లాసువాళ్లే.

బయటవున్న జనంలో నిమిష నిమిషానికీ హీరో రాంబాబును చూడాలనే కోరిక బలంగా పెరిగిపోతోంది. పోలీసులను నెట్టుకుంటూ లోపలకు వస్తున్నారు. కొంతమంది గోడలుదూకి లోపలకు వెళ్లటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాని—పోలీసులు వాళ్ల ప్రయత్నాలను సాగనీయటం లేదు.

నిర్మాత తర్వాత థియేటర్లో 'కష్టజీవులు' సినిమా దర్శకుడు మాట్లాట్టం మొదలుపెట్టాడు.

'కష్టజీవులు' సినిమాకు నేను దర్శకుడిని కావటం నిజంగా నా అదృష్టం. నిర్మాత నా దగ్గరకు వచ్చి ఈ చిత్రం కథగురించి చెప్పినప్పుడే ఇది మంచి చిత్రంగా తయారవుతుందనిపించింది. ఈ సినిమా తియ్యటానికి ముందు నేను కొన్నిరోజులు కష్టజీవుల గురించి స్టడీచేశాను. నేను అనుకున్నట్టుగానే 'కష్టజీవులు' సినిమా కష్టజీవులను బాగా ఆకర్షించింది. జనంలో నాకు వున్న పేరుకూడా పెరిగింది. ఏమైనా కష్టజీవుల విజయానికి కారకులైన కష్టజీవులకు నేనెప్పుడూ రుణపడివుంటాను'' అని కూర్చున్నాడు.

ఘల్లీ చప్పట్లు.

థియేటర్ ముందు జనంలో ఆవేశం పెరిగిపోతోంది. వాళ్లు పోలీసులతో గొడవ పడుతున్నారు. ''మా అభిమాన హీరో రాంబాబును చూడకుండా



పోటీ కథలలో సాధారణ ప్రచురణకు ఎన్నికయిన కథ

ఆపటానికి మధ్యలో మీరెవరు?'' అంటూ పోలీసుల [redacted] పించింది. వాళ్లను తల్చుకోగానే తను మాట్లాడుతున్న విషయం గుర్తుకొచ్చింది.

''కష్టజీవులు'' చిత్రం రోజల్లా ఎండనకా—వాన నకా కష్టించి పనిచేసే జీవుల జీవితానికి ప్రతిబింబం.. ఈ చిత్రంలో హీరోగా నటించటానికి కారణం నా అదృష్టమే''

చప్పట్లు థియేటర్ నిండుగా—

బయట— పోలీసులను వెనక్కునెట్టి ముందుకు వచ్చారు జనం. వాళ్లలో చాలామంది కష్టజీవులే.. వాళ్లంతా కార్మికులూ—కూలిచేసుకునే మనుషులూ— 'కష్టజీవులు' సినిమా వాళ్ళందరినీ ఎంతగానో ప్రభావితం చేసింది. ఆ సినిమాలో హీరో వాళ్లందరికీ ఎంతో ఆప్తుడిగా అనిపించాడు. తమ మనిషిగా వాళ్లు అనుకున్నారు. అందుకే శతదినోత్సవానికి హీరో రాంబాబు ఆ థియేటర్‌కు వచ్చాడని తెలియగానే అతడ్ని చూట్టానికి పరిగెత్తుకుంటూ వచ్చారు.

కాని— పోలీసులు వాళ్లు థియేటర్ కాంపౌండ్‌లోకి కూడా అడుగుపెట్టనివ్వటం లేదు.

వాళ్లలో ఆవేశం పెరిగిపోయింది.

గేటును విసురుగా నెట్టేశారు. కానీ తాళంవేసి వుండటం వల్ల తెరుచుకోలేదు. పరిస్థితి చెయ్యిదాటిపోతోందని పోలీసులు లాఠీలను పైకెత్తారు. దొరికిన వాళ్లను దొరికినట్టుగా కొట్టటం మొదలుపెట్టారు.

కొంతమంది పరుగెత్తుతున్నారు. మరికొంతమంది ఇంకా అక్కడే నిలబడి ''రాంబాబూ బయటకు రావాలి. రాంబాబూ..జిందాబాద్'' అని అరుస్తున్నారు.

మీద తిరగబడుతున్నారు. వాళ్లందరికీ జవాబులు చెప్ప లేక పోలీసులు విసుక్కుంటున్నారు.

దర్శకుడు కూడా మాట్లాడిన తర్వాత హీరో రాంబాబు స్టైయిల్‌గా నిల్చున్నాడు లేచి.

''నటుడిగా ఇంతకుముందు నేను చాలా చిత్రాల్లో నటించాను. వాటిల్లో ఎక్కువ చిత్రాలు విజయవంతమైనాయి. నూరురోజుల పండగ జరుపుకున్నాయి. ఆ చిత్రాల శతదినోత్సవ వేడుకలలో నేను పాల్గొన్నాను. కాని అప్పుడు నాకు అంతగా సంతోషమనిపించలేదు. కాని—ఈ రోజు అలాకాదు. నాకు ఎంతో సంతోషంగావుంది. 'కష్టజీవులు' చిత్రంలో హీరోని నేనుకాదు. ఒక్కొక్క కష్టజీవి. నేను నటించిన చిత్రాలన్నీ ఒకఎత్తు. 'కష్టజీవులు' ఎంతో విలువైన ప్రయోగాత్మక చిత్రం. ఈనాటి కూలివాడు, కార్మికుడు ఎలాంటి నికృష్టమైన జీవితాన్ని గడుపుతున్నాడో బట్టబయలు చేసిన చిత్రం. ప్రజలలో ఎంతో సంచలనం కలిగించిన చిత్రం....''

మధ్యలో ఆగాడు రాంబాబు.

కోలాహలంగా వుంది బయట. పరిస్థితి విషమించింది.

''రాంబాబూ జిందాబాద్'' రాంబాబూ ''బయటకు రావాలి'' జనం పిచ్చిగా అరుస్తున్నారు. వాళ్ల అరుపులు థియేటర్లోకి వినిపించాయి.

నవ్వుకున్నాడు రాంబాబు. జనానికి తనంటే ఎంత అభిమానం అనుకున్నాడు. అతనికి చాలా గర్వమని

అయినా రాంబాబు మాట్లాడటం ఆపలేదు.

''ఈ చిత్రానికి జాతీయ బహుమతి వస్తుందనటంలో ఎలాంటి అనుమానం లేదు. వాస్తవానికి దగ్గర్లో వున్న చిత్రాలకు జనాదరణ ఎలావుంటుందో ఈ చిత్రమే రుజువుచేసింది. ఈ రోజు మనందరం ఇక్కడ ఈ శతదినోత్సవం జరుపుకోవటానికి కారకులు కష్టజీవులే. వారి ఆదరణవల్లనే నిర్మాతకు డబ్బులు, మనకు మంచిపేరూ వచ్చాయని గట్టిగా చెప్పగలను. ఇకముందుకూడా మరికొన్ని కష్టజీవుల సమస్యలను..''

లాఠీచార్జీ జోరుగా సాగుతోంది. అప్పటికే ఓ పదిమందికి తలలు పగిలాయి. వాళ్లు నెత్తురు మడుగులో పడిపోయారు.

లైట్లు పగులుతున్నాయి.

కష్టజీవుల తలలూ పగులుతున్నాయి.

కష్టజీవుల అభిమాన హీరో రాంబాబుకు చీమకుట్టినట్టుగా అయినా అనిపించలేదు. బయట—తనని చూడాలని ఎంతో ఆశతో వచ్చి తలలు పగలకొట్టించుకుంటున్న కష్టజీవుల కష్టాలను పట్టించుకోకుండా వారి సమస్యల గురించి మాట్లాడుతున్నాడు.

థియేటర్‌లోపల 'కష్టజీవలు' సినిమా శతదినోత్సవం జరుగుతోంది.

బయట కష్టజీవులకీ—పోలీసులకీ మధ్య యుద్ధం జరుగుతోంది. ●




నిర్మాత: వి.దొరస్వామిరాజు B.Com., దర్శకత్వం: ఎ.కోదండరామిరెడ్డి
చక్రవర్తి • సత్యానంద్ • సుధాకరరెడ్డి • వెంకటరత్నం • శ్రీనివాసరాజు • సూపర్ సుబ్బరాయన్ • సదాశివరావు